క్లుప్తంగా

రహస్య కెమెరాలు లేవు

ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ అమ్మాయిల హాస్టల్ వాష్ రూముల్లో ఎలాంటి హిడెన్ కెమెరాలు లేవని ఏలూరు రేంజి ఐజీ జి.వి.ఎస్.అశోక్‌కుమార్ తెలిపారు. కాలేజీపై వస్తున్న ఆరోపణలపై పోలీసు బృందాల దర్యాప్తు వివరాలను ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతోందని, వారంతో తుది నివేదికను విడుదల చేస్తామన్నారు. క్రిమినల్ కేసుల్లో ఏపీలో తొలిసారిగా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఢిల్లీ టీం సేవలను వినియోగించామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా పోలీసుల విచారణ జరిగిందన్నారు. హాస్టల్ వాష్ రూముల్లో కెమెరాలు ఏర్పాటు చేశారంటూ వచ్చిన ఆరోపణలతో వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు బృందాల పర్యవేక్షణలో ఆరోపణలు వచ్చిన వెంటనే హాస్టల్ వాష్ రూముల్లో తనిఖీ చేశామన్నారు. వాష్ రూములు, షవర్లలో ఎటువంటి కెమెరాలు లేనట్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని సెర్ట్ బృందం సభ్యులకు అప్పగించామన్నారు. ఆ బృందం మూడు రోజుల్లో తుది నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎవ్వరూ భయపడనవసరం లేదని, ఈ ఘటనపై ఎటువంటి ఆధారాలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసకురావచ్చన్నారు. సమావేశంలో ఎస్పీ గంగాధరరావు, డీఎస్పీ లతాకుమారి, సీఐలు రమణి, సోమేశ్వరరావు, ఎస్.ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

పామర్రు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యానికి ఉపయుక్తం అవుతుందని పామర్రు ఐసీడీఎస్ సీడీపీఓ వీ భానుశ్రీ పేర్కొన్నారు. స్థానిక తోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తినే ఆహారంలో రోజూ ఆకుకూరలు, చిరు ధాన్యాలు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యశ్రీ, ఎంఈఓలు పద్మవాణి, మహిళా పోలీస్ స్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూపరాణి, ఉమాదేవి, విజయజ్యోతి, రత్నశ్రీ, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



గుడివాడరూరల్/నందివాడ: వరదలతో నష్టపోయిన ప్రతిఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అమెరికా పర్యటన ముగించుకుని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా నందివాడ మండలంలోని వరద ప్రభావం ఉన్న పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, పుట్టగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే రాము శుక్రవారం పర్యటించారు. వరద ఉధృతి ఉండటంతో ట్రాక్టర్‌పై ఎమ్మెల్యే గ్రామాల్లోకి చేరుకుని బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ పి.పద్మావతి, సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్ఐ కె.శ్రీనివాస్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ మల్లిక పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి చర్యలు



పమిడిముక్కల: హనుమంతపురం–కనుమూరు రహదారిపై వేల్పూరు వద్ద కోతకు గురైన ప్రమాదకరంగా ఉన్న రహదారిని, వంతెనను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శుక్రవారం పరిశీలించారు. వంతెన వద్ద రహదారి కోతకు గురైందని, వంతెన కూలేందుకు సిద్ధంగా ఉండడంతో రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నామని వేల్పూరు గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. వంతెన సమస్యపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి నరేష్, టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఉండ్రపూడి(పామర్రు): ముంపునకు గురైన పొలాల బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కుమార్‌రాజా అన్నారు. మండలంలోని ఉండ్రపూడి, పోలవరంలో నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల అంచనాల మేరకు రైతులకు నష్ట పరిహారం అందిజేస్తామన్నారు. రైతులు శంకరబాబు, వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల హృదయాల్లో ఉత్తమ గురువులు

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఉత్తమంగా పాఠాలు బోధించిన గురువులను విద్యార్థుల హృదయాల్లో ఎక్కువ రోజులు గుర్తుంటారని ఘంటసాల కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్లో ఉద్యోగ విరమణ పొందిన చిన్నం అరసపల్లి రావును శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు సాల్మన్‌కొల్లాబత్తుల, యూటీఎస్ జిల్లా కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

తగ్గేదేలే.!

కొనసాగుతున్న బుడమేరు ఉధృతి



జనార్దనపురం వద్ద ఎంఎన్‌కే రహదారిని ముంచెత్తిన వరద నీరు

వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో బుడమేరు ఉధృతి కొనసాగుతూనే ఉంది. పుట్టగుంట వంతెన వద్ద బుడమేరు నీటి మట్టం 24 అడుగులకు చేరింది. దీంతో ఏడో రోజు ఎంఎన్‌కే రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పలు గ్రామాలు ముంపులోనే ఉన్నాయి.

గుడివాడరూరల్: విజయవాడ నుంచి వస్తున్న వరద నీటితో పుట్టగుంట వంతెన వద్ద నుంచి మూడు కిలో మీటర్ల దూరంలోని జనార్దనపురం వరకు ఎంఎన్‌కే రహదారిపై మోకాళ్ల లోతు నీళ్లు చేరాయి. నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉండటంతో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. బుడమేరు నీరు అరిపిరాల, దోసపాడు చానల్లలోకి చేరడంతో వాటి కరకట్టలను దాటి ప్రవహించడంతో పరిసర ప్రాంతాల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జనార్దనపురం నుంచి కుదరవల్లి వరకు దోసపాడు చానల్ పొంగడంతో ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ముంపునకు గురైంది. రోడ్డుపై మూడు అడుగుల మేర నీళ్లు చేరి ప్రమాదకరంగా మారింది. ఇలపర్రు, అరిపిరాల, రామాపురం, పెదవిరివాడ, పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, ఒడ్డులమెరక గ్రామాలకు ఇతర గ్రామాలతో సంబంధాలు లేకుండా పోవడంతో ఆయా గ్రామాల నుంచి ప్రజలు బయటకి రావడానికి మరపడవలు, స్పీడ్ బోట్లను ఉపయోగించుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా మునిగిన పంట పొలాలు తేరుకోవాలంటే కనీసం 10 రోజులు పట్టే అవకాశం ఉండటంతో పంట పూర్తిగా పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

బుడమేరు నుంచి వరద నీరు దిగువనకు వస్తే నందివాడ మండలంలోని బుడమేరుకు ముంపు పొంచి ఉందని అధికారులకు ముందస్తుగానే తెలిసినా కరకట్టల భద్రత వైపు కన్నెత్తి చూడలేదు. చాలా చోట్ల కరకట్టలు బలహీనంగా ఉండడంతో గండ్లు పడే అవకాశాలున్నాయి. వాటిని గుర్తించి గండ్లు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో ఆక్వా రైతులు ప్రజల సహకారంతో కరకట్టలను పటిష్టం చేసే పనులను చేపట్టారు. అరిపిరాల, పుట్టగుంట, రామాపురం, కుదరవల్లి గ్రామాల వద్ద ఆక్వా రైతులు, ప్రజలు పరస్పర సహకారంతో మట్టి, ఇసుక, బుసక కట్టలతో గండ్లు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పటిష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం వచ్చిన ముంపును దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో బుడమేరుకు మరో ముప్పు సంభవించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



జలదిగ్బంధంలో తుమ్మలపల్లి గ్రామ ప్రధాన రోడ్డు

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

కలెక్టర్ బాలాజీ

గుడివాడ టౌన్: బుడమేరు ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో దాని సమీప గ్రామాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బుడమేరు వరదనీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న నేపథ్యంలో రుద్రపాక, జొన్నపాడు, నందివాడ, ఇలపర్రు, గాజులపాడు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే తరలించాలన్నారు. ప్రత్యేక బస్సులు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి స్థానిక



ఏలూరు రోడ్‌లోని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల, బైపాస్ రోడ్ లోని సజ్జా బర్నబాస్ శాంతి ఆశ్రమానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి. పద్మావతి, నందివాడ తహసీల్దార్ మల్లిక, ఎంపీఐ నారాయణ స్వామి పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే ముద్దు

గుడ్లవల్లేరు: పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకున్న భక్తులు తమ పూజలకు మట్టి విగ్రహాలపైనే దృష్టి సారించారు. ప్లాస్టరాఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక ప్రతిమలను కొనేందుకు అంతగా ఇష్టపడటం లేదు. ఇప్పటికే చెరువులు, కాల్వలు, గుంతలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. వినాయక చవితి వచ్చిందంటే చెరువులు కాల్వలు రసాయన విగ్రహాల నిమజ్జనం వలన మరింత కాలుష్యానికి గురవుతున్నాయి.



అరచేతిలో ఇమిడిపోయే మట్టి వినాయక ప్రతిమ

కాలుష్య మహమ్మారిని పారదోలాలి

ఈ కాలుష్య మహమ్మారిని పారదోలేందుకు మట్టి వినాయకుడినే ఈ సారి చవితికి ఉపయోగించాలని చాలామంది భక్తులు కోరుతున్నారు. రసాయనాలతో కలుషితం చేయకుండా వినాయకచవితిని ఆనందంగా జరుపుకోవాలని, ఇంటిలోనే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసుకునేందుకు పిల్లలను తమ తల్లిదండ్రులు ప్రోత్సాహిస్తున్నారు. అలా చేయలేకపోతే మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి పూజలు చేయాలని చెబుతున్నారు. కొన్ని సంస్థల నిర్వాహకులు కూడా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రతిమల్లో అయితే పర్యావరణ పరిరక్షణ కోసం వాటిని తయారు చేసేటప్పుడే కొన్ని విత్తనాలను కూడా ఉంచుతున్నారు. పూజల అనంతరం ఆ వినాయకుడి విగ్రహాన్ని ఇంటి పెరట్లోనే నీటితో తడిపి నిమజ్జనం చేసుకుంటే ఆ విగ్రహంలో ఉండే విత్తనాలు మొక్కలుగా పెరిగి పర్యావరణానికి మేలు చేస్తాయని చెబుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

- మొరాయించిన బోటు
- రక్షించిన గజ ఈతగాళ్లు

గుడివాడరూరల్: బోటు బోల్తా పడే పరిస్థితి తలెత్తడంతో అందులో ఉన్న గజ ఈతగాళ్లు వెంటనే నీటిలోకి దూకి రక్షించడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన పుట్టగుంట వద్ద బుడమేరులో శుక్రవారం చోటు చేసుకుంది. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమెరికా నుంచి గన్నవరం వచ్చారు. అక్కడి నుంచి నేరుగా వరద ప్రభావిత ప్రాంతాలైన పుట్టగుంట చేరుకున్నారు. ఎమ్మెల్యే పర్యటనకు నందివాడ నుంచి ఎంపీడీఓ, ఇన్‌చార్జి తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు బోటులో పుట్టగుంట వంతెన వద్ద గుడివాడ వైపు నుంచి బుడమేరులో పుట్టగుంట గ్రామానికి బయల్దేరారు. డ్రెయిన్ మధ్యలోకి వెళ్లగానే వంతెన కింద భాగం బోటుకు పట్టి వెళ్లకుండా మొరాయించింది. బోటు బోల్తా పడే పరిస్థితి తలెత్తడంతో అందులో ఉన్న గజ ఈతగాళ్లు వెంటనే నీటిలోకి దూకి బోటు బోల్తా పడకుండా ఆపారు. బోటును సురక్షితంగా అవతల వైపునకు చేర్చారు. దీంతో బోటులో ఉన్న అధికారులు, మీడియా ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.



పుట్టగుంట వంతెన వద్ద బుడమేరులో బోటును ప్రమాదానికి గురి కాకుండా ఆపిన గజ ఈతగాళ్లు

14న జాతీయ లోక్ అదాలత్

గుడివాడ టౌన్: కేసుల సత్వర పరిష్కారంతో కక్షిదారులకు సమన్యాయం చేసేందుకు ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రభుత్వ ఇన్సూరెన్స్ తదితర లావాదేవీలకు సంబంధించిన కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

గుడివాడ టౌన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిమలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టూటౌన్ సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారించేందుకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను వాడాలని కోరారు. క్లబ్ అధ్యక్షుడు ఉప్పలపాటి సతీష్, కార్యదర్శి వేణుగోపాల స్వామి, కోశాధికారి పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, బొగ్గారపు తిరుపతయ్య, గాయత్రి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.
- ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్‌లో మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. యువజన విభాగం అధ్యక్షుడు బి. బాదేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వీఎస్ రవి కిరణ్, కోశాధికారి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వినాయక చవితికి మట్టి వినాయక ప్రతిమలను శుక్రవారం గుడ్లవల్లేరులోని శ్రీ విజేత సూపర్ మార్కెట్ వారు తమ వినియోగదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. మార్కెట్ నిర్వాహకులు బొప్పా వీర వెంకటసుబ్బారావు, రాకేష్ రవితేజ, భార్గవిశ్రీ, హిమబిందు పాల్గొన్నారు.

పాఠశాల్లో ప్రతిమల పంపిణీ

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెదముత్తేవిలోని ఎస్ఎల్ఎస్‌వీపీఎస్ సంస్కృతోన్నత పాఠశాల్లో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వాతావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలను వినియోగించటం వలన పర్యావరణాన్ని కాపాడవచ్చని పాఠశాల హెచ్ఎం కే మాధవి పేర్కొన్నారు.



గుడివాడలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చవితి సందడి

పెదపూడి(మొవ్వ): వినాయక చవితికి కావాల్సిన పత్రి, పాలవెల్లి, మట్టి విగ్రహాలు, పండ్లు, పూలను కొనుగోలు చేసేందుకు వచ్చినవారితో పలు గ్రామాల ప్రధాన కూడళ్లు సందడిగా మారాయి. వారం రోజులుగా వర్షాలు కురవటంతో పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. మండల పరిధిలోని కూచిపూడి, పెదపూడి, మొవ్వ, నిడుమోలు, కాజ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో దుకాణాల వద్ద భక్తులతో సందడి వాతావరణం నెలకొంది.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో శుక్రవారం పండగ వాతావరణం ఏర్పడింది. వినాయక చవితికి కావాల్సిన వస్తు సామగ్రి సేకరించడంలో పట్టణం బిజీబిజీగా మారింది. పురవీధుల్లో పత్రి, వినాయక విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేసే విషయంలో బిజీబిజీగా గడిపాయి.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న మిద్దె శ్రీనివాసరావును శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. గుడివాడకు చెందిన ఉపాధ్యాయుడు జాతీయ స్థాయి అవార్డు అందుకోవడం పట్టణానికే గర్వ కారణం అని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు టీఎన్.రాజశేఖర్, కార్యదర్శి కిరణ్‌బాబు, సభ్యులు వై.రెడ్డయ్య చౌదరి పాల్గొన్నారు.

పందిళ్ల ఏర్పాట్లకు అనుమతులు తప్పనిసరి

గుడివాడరూరల్: మండల పరిధిలో వినాయక చవితి పందిళ్లు, మండపాలకు అనుమతులు తప్పనిసరి అని గుడివాడ రూరల్ ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్‌తో పాటు డీజే వంటి సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసేందుకు, తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వినాయక చవితి వేడుకలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ డి.వెంకటకుమార్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. కమిటీల నిర్వాహకులతో పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై నీరు నిలిచి అస్తవ్యస్తంగా మారాయని తెలిపారు. రోడ్లపై బ్లీచింగ్, సున్నం చల్లారు.

‘నైతికతే నిజమైన స్వేచ్ఛ’పై అవగాహన

పామర్రు: జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ‘నైతికతే నిజమైన స్వేచ్ఛ’ అనే నినాదంతో అవగాహన ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ స్థానిక అధ్యక్షురాలు తహసీన్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛ దుర్వినియోగమవుతోందన్నారు.

సంక్షిప్త వార్తలు

■ కొల్లేరు గ్రామాలను ముంచెత్తిన వరద

కైకలూరు: కొంప కొల్లేరే అనేది మన తెలుగు ప్రజల నానుడి. ఇప్పుడు అది కొల్లేరు విషయంలో నిజంగానే కనిపిస్తోంది. విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరద నీరు కొల్లేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. బుడమేరుకు ఎర్రకాల్వ, తమ్మిలేరు నీరు తోడవడంతో ప్రవాహ వేగం మరింతగా పెరిగింది. పెదఎడ్లగాడి వంతెన వద్ద 3.5 మీటర్లపైనే నీటి మట్టం నమోదైంది. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ కైకలూరు, మండవల్లి మండలాల ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కైకలూరులో పలు వార్డులలోకి నీరు చేరుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు చుట్టుముడుతోంది. దీనికి తోడు వర్షాలు కురుస్తున్నాయి. అదేవిధంగా తామరకొల్లు నుంచి వేమవరప్పాడు గ్రామం మధ్యలో పెదకొమ్ములేరు డ్రెయిన్ వల్ల రహదారిపై నీరు చేరడంతో అధికారులు రాకపోకలను నిలుపుదల చేశారు. కైకలూరు–గోపవరం రోడ్డులో వంతెన వద్ద పుల్లవ డ్రెయిన్ వలన నీటి ప్రవాహం ఉధృతమవుతోంది. కైకలూరు వర్లకోడు డ్రెయిన్‌లో నీటి ప్రవాహం స్తంభిస్తోంది. శ్యాంప్ డ్రెయిన్ వేగంగా వెళుతోంది. కైకలూరు ఒకటో వార్డులో పలు గృహాలు నీటిలో మునిగాయి.

■ వరద బాధితులకు ఉద్యోగుల సాయం

ముదినేపల్లి రూరల్: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు, ముదినేపల్లి కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ ఉద్యోగులు నడుం బిగించారు. కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ పరిధిలో 13 సంఘాల్లో పని చేసే సీఈఓలు, సిబ్బంది, ముదినేపల్లి బ్రాంచి ఉద్యోగులు విరాళాలు సేకరించి వరద బాధితులకు దుస్తులు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు శుక్రవారం విజయవాడ తీసుకెళ్లారు. బ్యాంకు మేనేజర్ వీర్ల సత్యకుమార్, సూపర్వైజర్ నాగభూషణం, కార్యదర్శులు శ్రీనివాసురావు, ప్రసాద్, మణీంద్రరావు, అల్లాడ దుర్గారావు ఆధ్వర్యంలో విజయవాడ వెళ్లారు.

■ పునరావాస కేంద్రంలో భోజనం ఏర్పాటు

పెదపారుపూడి: పెదపారుపూడి జెడ్పీ హైస్కూల్లో నాలుగు రోజుల నుంచి మోపర్రు గ్రామస్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తహసీల్దార్ వై రంగారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 100 మంది బాధితులకు భోజనం తయారు చేయించి వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ కలిసి ముందుకొచ్చి బాధితులకు ఒక పూట భోజనం అందించటం సంతోషంగా ఉందన్నారు.

■ నవరాత్రుల నిర్వాహకులకు అవగాహన

గుడ్లవల్లేరు: వినాయక చవితి నవరాత్రుల నిర్వాహకులకు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అవగాహన సదస్సును చేపట్టారు. నవరాత్రుల మండపాల సందర్శన సమయంలో నిరభ్యంతర పత్రంలోని క్యూఆర్ కోడ్‌ను తమ పోలీసులు స్కాన్ చేసి తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. ఏఎస్ఐ సారథి పాల్గొన్నారు.

■ ప్రణాళికాబద్ధంగా పంట నష్టం అంచనాలు

గుడ్లవల్లేరు: వరదలకు నీట మునిగిన వరి పంట పొలాల నష్ట అంచనాలను ప్రణాళికాబద్ధంగా నమోదు చేయాలని ఏఓ ఎల్.సునీల్ సూచించారు. ఈ విషయమై గుడ్లవల్లేరు ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ ఆధ్వర్యంలో ఆమె కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, వీఏలకు అవగాహన సదస్సును చేపట్టారు.

■ వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

పామర్రు: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషన్ వారి ఆదేశానుసారం నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పత్రికా విలేకరులను సన్మానించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, ప్రధాన కార్యదర్శి మురళీ సుధాకర్, కోశాధికారి వీరజనార్ధనరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ సత్యసాయి పాల్గొన్నారు.

■ పంట నష్టం వివరాలు నమోదు చేయండి

పమిడిముక్కల: భారీ వర్షాల వల్ల నష్టం వాటిల్లిన పంటల వివరాలను నమోదు చేయాలని ఏఓ గణేష్‌రెడ్డి వీఆర్వో, వీపీఏలకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. 10వ తేదీ లోపు నష్టం వివరాలు నమోదు చేసి, 11 నుంచి 16వ తేదీ వరకు రైతు సేవ కేంద్రాల వద్ద జాబితాలను ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్ఐ యేసుపాదం పాల్గొన్నారు.

■ ముంపు నీరు రాకుండా అడ్డుకున్న రైతులు

మొవ్వ: నీట మునిగిన పొలాల్లోని తొలగించేందుకు వెళ్లిన మొవ్వ రైతులను ఘంటసాల మండలం తాడేపల్లి, కొత్తపల్లి రైతులు అడ్డగించిన సంఘటన శుక్రవారం మొవ్వ శివారులో చోటు చేసుకుంది. మొవ్వ విద్యుత్ సబ్ స్టేషన్ దాటిన తర్వాత గల రేవడిదొడ్డిలో సుమారు 500 ఎకరాల వరి పైరు ముంపునకు గురైంది. ఈ నీటిని కాలువ ద్వారా దిగువ ప్రాంతానికి పంపిందుకు జేసీబీ ద్వారా పూడిక తీత తీసేందుకు వెళ్లిన మొవ్వ రైతులను దిగువ ప్రాంతాల రైతులు ప్రతిఘటించారు. దీంతో రైతుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఈ సమాచారం తెలుసుకున్న వీరంకి నీటి పారుదల శాఖ ఏఈ(ఇన్‌చార్జి) ప్రసాద్ కొత్తపల్లి బ్రాంచ్ కాలవ పూడికతీత పనులు తాము త్వరితగతిన చేపడతామని హామీ ఇవ్వటంతో సమస్య సద్దుమణిగింది.

■ బోనస్ పంపిణీ

మండవల్లి: మండలంలోని గన్నవరం సొసైటీ నందు శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు పొట్లూరి సీతారామదాసు అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుడ్లవల్లేరు మేనేజర్ తోట సత్యనారాయణ రూ.78,670 బోనస్‌ను పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ జి.గోపిరాజు, వేతన కార్యదర్శి కె.సత్య రాజేశ్వరరావు పాల్గొన్నారు.

■ చేపల చెరువుల్లా పొలాలు

మోపర్రు(పెదపారుపూడి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వందల ఎకరాల వరి పొలాలు చేపల చెరువులను తలపిస్తున్నాయి. నాలుగు రోజుల నుంచి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు ఉధృతంగా ప్రవహించటంతో వన్నేరు డ్రెయిన్ మండలంలోని వింజరంపాడు, మోపర్రు గ్రామాల్లో నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. వరద నీరు పంట పొలాలను ముంచెత్తాయి. మోపర్రు గ్రామంలో చేపల చెరువుల కారణంగా నీళ్లు దిగువకు వెళ్లకుండా పక్కనే తమ్మలంపాడు, దోసపాడు, నాగాపురం గ్రామాల్లో ప్రవహిస్తున్నాయి. గత 50 సంవత్సరాల్లో ఇలాంటి పరిస్థితి ఏనాడూ చూడ లేదని దోసపాడు, నాగాపురం రైతులు అంటున్నారు. విచ్చలవిడిగా చేపల చెరువుల ఉండటంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు పేర్కొన్నారు.